AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
5-9-2025 (Friday)
MAIN EDITION

ఆగని పసిడి పరుగులు.. మళ్లీ పెరిగిన ధరలు

అక్షరటుడే, బిజినెస్ డెస్క్: బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. కొన్ని రోజులుగా పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయే తప్ప తగ్గిన దాఖలాలు లేవు. ప్రస్తుతం తులం బంగారం అన్ని ట్యాక్స్‌లు కలుపుకొని దాదాపు రూ. లక్షా 7 వేలకుపైనే ఉంది. బంగారానికి మన భారతీయ సంప్రదాయంలో అత్యంత ప్రాధాన్యం ఇస్తుండడం, మరోవైపు పండుగ సీజన్‌లో ఇలా బంగారం ధరలు పెరుగుతూ పోతుండడం సామాన్యులను ఆందోళనకు గురిచేస్తోంది. శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,06,850గా నమోదు కాగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.97,940గా ట్రేడ్ అయింది. ఇక వెండి విషయానికొస్తే కిలోకు రూ. లక్షా 26,900గా నమోదైంది.

ఫ్లిప్‌కార్టు, అమెజాన్ పండుగ ఆఫర్లు

అక్షరటుడే, బిజినెస్ డెస్క్ : ప్రముఖ ఈకామర్స్ సంస్థలు ఫ్లిప్‌కార్టు, అమెజాన్ పండుగ ఆఫర్లను ప్రకటించాయి. ఈ నెల 23 నుంచి ఫెస్టివల్ సేల్ ప్రారంభమవుతుందని పేర్కొన్నాయి. జీఎస్టీ రేటు కోతలు అమల్లోకి వచ్చిన తర్వాతి రోజు నుంచే తమ ఫ్లాగ్‌షిప్ పండుగ సీజన్ అమ్మకాలను ప్రారంభించనున్నాయి. కీలకమైన పండుల షాపింగ్ కాలంలో విక్రయాలను మరింత పెంచుకోవడానికి ఆయా ప్లాట్‌ఫారమ్‌లు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్, అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ ఫ్లాగ్‌షిప్ సేల్ ఈవెంట్ల లాంచ్ తేదీలను తమ యాప్‌లలో వెల్లడించాయి.

ఏఐని ట్రైన్ చేసి.. జాబ్ కోల్పోయిన ఉద్యోగి

అక్షరటుడే, నేషనల్‌డెస్క్ : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ప్రతీ రంగంలో వేగంగా పెరుగుతోన్న ఈ రోజుల్లో, అది ఉద్యోగాలను ఎలా ప్రభావితం చేస్తోందో తెలిపే సంఘటన తాజాగా ఆస్ట్రేలియాలో చోటు చేసుకుంది. 63 ఏళ్ల క్యాథరిన్ సుల్లీవన్, 25 ఏళ్లుగా సేవలందించిన కామన్ వెల్త్ బ్యాంక్ ఆఫ్ ఆస్ట్రేలియాలో ఉద్యోగాన్ని కోల్పోయింది. ఆమె ఉద్యోగం పోవడానికి కారణం ఆమె ట్రైన్ చేసిన ఏఐ వ్యవస్థ కావడం చర్చనీయాంశమైంది. ఉత్పాదకత పెంచడం, ఖర్చులు తగ్గించుకోవడం కోసం ఆ బ్యాంక్ ఇటీవల ఏఐ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ట్రైనింగ్ కార్యక్రమాన్ని చేపట్టింది. క్యాథరిన్ సహా మరికొంతమంది సీనియర్ ఉద్యోగులను ఏఐ ట్రైనింగ్ టీమ్‌లో చేర్చారు. బ్యాంక్ కొత్తగా ట్రైనింగ్ పొందిన ఏఐ వ్యవస్థను అధికారికంగా ప్రవేశపెట్టారు. కొన్ని వారాల వ్యవధిలోనే, బ్యాంక్ 44 మంది ఉద్యోగులను తొలగించే నిర్ణయం తీసుకుంది. క్యాథరిన్ కూడా ఆ లిస్ట్‌లో ఉండడం ఆమెను కలిచివేసింది.

నయా హెయిర్ స్టైల్‌తో హార్దిక్ పాండ్యా

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా కప్ 2025 ప్రారంభానికి ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అభిమానులకు ఒక పెద్ద సర్‌ప్రైజ్ ఇచ్చాడు. యూఏఈ వెళ్లిన వెంటనే కొత్తగా హెయిర్ స్టైల్ చేయించుకొని, స్టైలిష్ లుక్‌లో ఫోటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశాడు. "New Me" అనే క్యాప్షన్ తో పోస్ట్ చేసిన ఈ ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. గురువారం టీమిండియా ఆటగాళ్లతో పాటు హార్దిక్ పాండ్యా యూఏఈకి బయలుదేరాడు. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించినపుడు సాధారణ హెయిర్ స్టైల్‌లో ఉన్న అతడు, దుబాయ్‌కు చేరుకున్న తర్వాతే తన హెయిర్ స్టైల్ మార్చుకున్నట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ అధినేత, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అజ్ఞాతం వీడడం లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నా.. పార్టీలో, సొంతింట్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పెదవి విప్పడం లేదు. ఫామ్‌హౌస్ గడప దాటి బయటకు రావడం లేదు. మేడిగడ్డ కుంగినా, పదేళ్ల అవినీతిపై కేసులు పెట్టినా, కవితను అరెస్టు చేసినా, తనతో పాటు కుమారుడు కేటీఆర్ విచారణను ఎదుర్కొంటున్నా, బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ప్రచారం జరిగినా, కవిత ఎదురుతిరిగినా.. అడుగు బయట పెట్టడంలేదు. ఏ ఒక్క అంశంపైనా స్పందించడం లేదు. జనం ముందుకొచ్చి సమాధానం చెప్పడంలేదు. కేసీఆర్ మౌనం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

కారులో కల్లోలం..

గులాబీ బాస్ మౌనం..



- సొంత పార్టీలో సంక్షోభం తలెత్తినా స్పందించని అధినేత
- కూతురే ధిక్కార స్వరం వినిపించినా అజ్ఞాతం వీడని వైనం
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకూ కాలు బయట పెట్టని ప్రతిపక్ష నేత
- స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నా అజ్ఞాతం వీడని కేసీఆర్

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయినప్పటి నుంచి కేసీఆర్ ప్రజా జీవితానికి దూరమయ్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. చివరకు అసెంబ్లీ సమావేశాలకు సైతం దూరంగా ఉన్నారు. ఎంతో కీలకమైన బిల్లులతో పాటు తానే ఇంజినీర్‌గా మారి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ప్రత్యేకంగా జరిగిన అసెంబ్లీ సమావేశాలకు కూడా హాజరు కాలేదు. ఇక, కవిత ఎపిసోడ్ బీఆర్ఎస్ పార్టీలో కల్లోలం రేపిన తరుణంలోనూ ఆయన బయటకు రాలేదు. పార్టీలో తీవ్ర గందరగోళం నెలకొన్నా, తన సొంతింట్లోనే సంక్షోభం ఏర్పడినా కాలు బయట పెట్టలేదు. ఈ నేపథ్యంలో కేసీఆర్ వైఖరి అనేక విమర్శలకు తావిస్తోంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకుని గద్దెనెక్కగా గులాబీ పార్టీ ఓటమి మూటగట్టుకుంది. పదేళ్ల పాలనలో ఎమ్మెల్యేలు, గులాబీ నేతలు చేసిన అరాచకాన్ని కేసీఆర్ పట్టించుకోకపోవడమే బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణం. ఉద్యమ పార్టీని గద్దెదించిన ప్రజలు ప్రతిపక్ష హోదా కట్టబెట్టారు. ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలపై గొంతెత్తాల్సిన కేసీఆర్ ఓటమి తర్వాత ఏ ఒక్కనాడు జనం ముందుకు వచ్చిందీ లేదు. పాలనా వైఫల్యాలపై పోరాటం చేసిందీ లేదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిందీ లేదు. గత 20 నెలల కాలంలో కేసీఆర్ జనం మధ్యకు వచ్చింది ఒకటి, రెండుసార్లు మాత్రమే.

సాగునీటి సమస్యలపై నల్లగొండ జిల్లాలో ఒకసారి పర్యటించారు. బీఆర్ఎస్ పార్టీ పాతికేళ్ల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రజతోత్సవ సభకు మరోసారి హాజరయ్యారు. ఇక, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూ పేరిట ఒకసారి బయట కనిపించారు. తప్పితే కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను వీడి బయటకు రాలేదు. అనారోగ్యంతో బాధ పడుతున్న గులాబీ బాస్ ఒకటి, రెండుసార్లు ఆస్పత్రిలో చేరిన సమయంలో, కాళేశ్వరం అక్రమాలపై విచారణ జరిపిన పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు హాజరైన సమయంలోనే కనిపించారు.. తప్పితే ఆయన బయట కనిపించిన ఊసే లేదు.

అసెంబ్లీ సమావేశాలకూ డుమ్మా

ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాల్సిన కేసీఆర్ ఏ ఒక్కనాడు హాజరు కాలేదు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేందుకు అసెంబ్లీని చక్కని వేదిక. కానీ ఏ ఒక్కనాడు కూడా కేసీఆర్ సభకు వచ్చిందీ లేదు. సమస్యలను ప్రస్తావించిందీ లేదు. బిల్లులపై చర్చల్లో పాల్గొన్నదీ లేదు. ఈ 20 నెలల కాలంలో ఆయన అసెంబ్లీకి వచ్చింది రెండుసార్లు మాత్రమే. శాసన సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఒకసారి వచ్చారు. తరచూ సమావేశాలకు హాజరు కాకుంటే పదవీ నుంచి తొలగించే అవకాశం ఉండడంతో మరోసారి మాత్రమే ఆయన అసెంబ్లీకి వచ్చారు.. తప్పితే మళ్లీ శాసనసభ ముఖం చూడలేదు. కీలకమైన బడ్జెట్ సమావేశాలకు తోడు కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ నివేదికపై చర్చించేందుకు జరిగిన సమావేశాలకు సైతం ఆయన డుమ్మా కొట్టారు. ప్రభుత్వం తననే టార్గెట్‌గా చేసి కాళేశ్వరంపై రచ్చ చేస్తున్న సమయంలో సమాధానం చెప్పుకోవాల్సిన కేసీఆర్ అప్పుడు కూడా బయటకు రాకపోవడం గమనార్హం.

సొంతింట్లో సంక్షోభం..

వరుస ఓటములతో బీఆర్ఎస్ డీలా పడిన వేళ.. అధినేత బిడ్డ, ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ పార్టీలో కల్లోలం సృష్టించింది. గులాబీ శ్రేణుల్లో కలకలం రేపింది. పార్టీపై సొంత కూతురే ధిక్కార స్వరం వినిపించడం, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని చెప్పడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. కేసీఆర్ వైఖరినే ప్రశ్నించేలా కవిత సంధించిన లేఖ బయటకు రావడం, ఆ తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలో సంక్షోభం సృష్టించాయి. కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావులపై చేసిన ఆరోపణలు కల్వకుంట్ల కుటుంబంలో చిచ్చు రేపాయి. ఈ నేపథ్యంలో నేతలు, కార్యకర్తలు గందరగోళంలో పడిపోయిన తరుణంలోనూ కేసీఆర్ నోరు విప్పలేదు. వారికి భరోసా ఇచ్చే ప్రయత్నం చేయలేదు. ఏదేమైనా ప్రజల కోసం, లక్షల మంది కార్యకర్తల కోసం కేసీఆర్ మౌనం వీడాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సమాజంలో శాంతి వెల్లివిరియాలి: మోదీ

అక్షరటుడే, నేషనల్ డెస్క్ : మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం స్థాపకుడు ప్రవక్త ముహమ్మద్ జయంతి సందర్భంగా మోదీ 'X'లో ఓ పోస్టు పెట్టారు. "పవిత్రమైన ఈ రోజు మన సమాజంలో శాంతి, శ్రేయస్సును తీసుకురావాలి. కరుణ, సేవ, న్యాయం విలువలు ఎల్లప్పుడూ మనల్ని నడిపిస్తాయి. ఈద్ ముబారక్!" అని పోస్టులో పేర్కొన్నారు. ఈద్ శుభాకాంక్షలతో పాటు భారతదేశ రెండో రాష్ట్రపతి, విశిష్ట ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. యువ మనస్సులను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర బలమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తుకు పునాది వేస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల అంకితభావాన్ని మోదీ ప్రశంసించారు.

కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం

అక్షరటుడే, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో విజన్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టబోతుంది. అమరావతి రాజధాని నగరం నుంచి విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిని అనుసంధానించేలా కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన నిర్మించాలని నిర్ణయించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఇప్పటికే నాలుగు ప్రత్యేక డిజైన్లు సిద్ధం చేయించింది. ప్రజలు తమకు నచ్చిన డిజైన్‌కు ఓటు వేయగలిగేలా అవకాశం కల్పించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ నాలుగు డిజైన్లలో మూడు కూచిపూడి నాట్యకళను ప్రతిబింబించేలా ఉంటే, మరొకటి ఆంగ్ల అక్షరం 'A' ఆకారంలో ఉండి, అమరావతి వైభవాన్ని చాటేలా రూపొందించారు. వంతెన నిర్మాణాన్ని ఇంజినీరింగ్, ఆర్ట్, హెరిటేజ్ మేళవింపుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. ఈ వంతెనను రాయపూడి నుంచి మూలపాడు వరకు సుమారు 5 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్నారు.

కాళేశ్వరం విచారణలో తొలి అడుగు.. హైదరాబాద్‌కు సీబీఐ డైరెక్టర్

అక్షరటుడే, హైదరాబాద్: 'కాళేశ్వరం' ప్రాజెక్టు అవినీతి అంశంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ నేడు హైదరాబాద్‌కు వచ్చారు. కోఠీలోని సీబీఐ బ్రాంచ్ కార్యాలయంలో అధికారులతో భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై విచారణ నేపథ్యంలో ఆయన హైదరాబాద్ రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా.. కాళేశ్వరంపై కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే లేఖ రాసిన విషయం విదితమే.

ఖైరతాబాద్ మహా గణపతికి సీఎం పూజలు

అక్షరటుడే, హైదరాబాద్: రాష్ట్రంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శనివారం హైదరాబాద్‌తో సహా వివిధ జిల్లా కేంద్రాల్లో నిమజ్జనోత్సవం నిర్వహించనున్నారు. కాగా.. ఖైరతాబాద్ మహా గణపతిని సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఖైరతాబాద్ గణపతి ఉత్సవాలు 71 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. నిమజ్జనోత్సవం కోసం నగరంలోని ట్యాంక్ బండ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అందరి సమన్వయంతో ఉత్సవాలు పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాట మార్చేసిన ట్రంప్..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: నోటికొచ్చింది వాగడం, ఆ తర్వాత మాట మార్చడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అలవాటుగా మారింది. తనను తాను శాంతి దూతగా ప్రచారం చేసుకునే ఆయన.. అనేక సంఘర్షణలను ఆపానని చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో ఏడు యుద్ధాలను ఆపానని ఇన్నాళ్లు చెప్పుకుంటూ వచ్చిన ట్రంప్.. ఇప్పుడు తాజాగా మాట మార్చారు. మూడు యుద్ధాలను విజయవంతంగా ఆపినట్లు పేర్కొన్నారు. వైట్ హౌస్‌లో టెక్ దిగ్గజాలతో నిర్వహించిన విందు అనంతరం ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపడం కష్టంగా మారిందని, అయినప్పటికీ దాన్ని పరిష్కరిస్తానని చెప్పారు. అదే సమయంలో ఇప్పటికే తాను మూడు యుద్ధాలను ఆపానని తెలిపారు. అయితే, అవి ఏయే దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలో చెప్పలేదు. "నేను మూడు యుద్ధాలను పరిష్కరించా. ఒకటి 31 సంవత్సరాలుగా కొనసాగుతున్న సంఘర్షణ. ఇందులో 10 మిలియన్ల మందికి పైగా మరణించారు, మరొకటి 34 సంవత్సరాలు కొనసాగుతుండగా, ఇంకొకటి 37 సంవత్సరాలుగా యుద్ధం కొనసాగుతోంది. నేను అధ్యక్షుడిగా అయ్యాక వాటిని ఆపానని" చెప్పుకొచ్చారు. దశాబ్దాలుగా జరుగుతున్న యుద్ధాలనే ఆపానని చెప్పడంతో.. ఇండియా-పాక్ సంఘర్షణలపై ఇన్నాళ్లు ఆయన చెబుతున్నది అబద్ధమని తేలిపోయింది.

పిల్లర్లు కుంగిపోతే ఇంత రాద్ధాంతమా?: హరీశ్‌రావు



అక్షరటుడే, హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు పిల్లర్లు కుంగిపోతేనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర రాద్ధాంతం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్‌కు కేసీఆరే సుప్రీం అని, ఎవరి విషయంలోనైనా నిర్ణయం తీసుకునేది ఆయనేనని చెప్పారు. కూతురి ఉన్నత విద్యకోసం యూకేకు వెళ్లిన ఆయన లండన్‌లో అక్కడి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత ఇటీవల తనపై చేసిన ఆరోపణలపై ఆయన సూటిగా స్పందించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి, కేసీఆర్ నాయకత్వం గురించి మాట్లాడుతూ పరోక్షంగా కవిత వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. ప్రజలకు సేవ చేయడమే తనకు కేసీఆర్ నేర్పించారని తెలిపారు. పార్టీలో కేసీఆరే సుప్రీం అని, ఏ నిర్ణయమైనా ఆయనే తీసుకుంటారని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో చివరిశ్వాస వరకు పని చేస్తానని స్పష్టీకరించారు. పార్టీ నిర్ణయాన్ని శిరసా వహిస్తానని హరీశ్ తేల్చిచెప్పారు.

ఎందుకింత రాద్ధాంతం

కాళేశ్వరంలో జరిగిన అవినీతి వెనక మాజీ మంత్రి హరీశ్‌రావు ఉన్నారని ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో.. లక్షలాది ఎకరాలను సాగులోకి తీసుకొచ్చేందుకు కేసీఆర్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారని హరీశ్‌రావు చెప్పారు. అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టులో ఒకటైన మేడిగడ్డ బరాజ్ వద్ద మూడు పిల్లర్లు కుంగితే రేవంత్‌రెడ్డి సర్కార్ రాద్ధాంతం చేస్తోందని ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేయడం లేదని ఆరోపించారు. పిల్లర్లు కుంగిపోయాయంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర నుంచి ఏం చేస్తోందని ప్రశ్నించారు.వానాకాలంలో విద్యుత్ డిమాండ్ ఉండదని చెప్పుకొచ్చారు. ఆ సమయంలో బాహుబలి మోటార్లతో నీటిని ఎత్తిపోసుకోవచ్చన్నారు.

భయాందోళనలో రియల్ ఎస్టేట్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయిందని హరీశ్‌రావు ఆరోపించారు. హైడ్రా పేరుతో రాష్ట్రంలో భయాందోళనలు సృష్టించారన్నారు. దీంతో హైడ్రా కారణంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని విమర్శించారు. రేవంత్ సర్కారు వల్లే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, వచ్చిన కంపెనీలు కూడా వెళ్లిపోతున్నాయని ఆరోపించారు. ఎన్నారైలు తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు ఎందుకు పెట్టడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు.